


# కలకానిది విలువైనది

బలభద్ర పాత్రుని రమణి

అప్పుడే పండిన గోరింటాకులా ఎర్రగా వున్నాడు సూర్యుడు. దుప్పటీ ఓసారి తీసి చూసి మళ్ళీ ముసుగు పెట్టేశాడు శేషాచలం. వసారాలోకి కూడా ఎండ తోసుకొచ్చేస్తోంది.

"మీ నాన్నని లెమ్మనవే ! రాత్రంతా ఏదో పొడిచేసినట్లు ఎందుకటా ఇంతపొద్దెక్కేదాక నిద్రా?" భార్య శాంతమ్మ గొంతు ఖంగుమంది.

శేషాచలంకి మనసు చివుక్కుమంది. తను రిటైరయ్యేదాకా తన భార్య "ఓ సేవ్! గోల చేయ్యకండి నాన్నగారు నిద్రపోతున్నారు" అని పిల్లల్ని కసిరేది. ఇప్పుడేమో ఇలా! తను ఇప్పుడు పనికిరాని చెత్త సామాన్లలో ఒకడిగా మారిపోయాడు కామోసు! అతనికి దొడ్లో షెడ్లో పారేసిన పాత సైకిలు, కుసులు విరిగిన చెక్కమంచం గుర్తుకొచ్చాయి. 'నేనూ అంతే' అనుకున్నాను.

"ఏవయ్యోయ్! ఇంకలే.." దుప్పటీ బర్రున లాగుతూ అంది శాంతమ్మ.

'దీనికి ఈ పేరు ఎందుకు పెట్టారో!' అనుకుంటూ కళ్ళు తెరిచిన శేషాచాలానికి, తల పిడపతో కాసంత కుంకుమ బొట్టుతో, చేతిలో కాఫీ గ్లాసుతో భార్య లక్ష్మీదేవిలా కనిపించింది.

ఆడించిన కాఫీ గింజల పొడితో చేసిన కాఫీ ఘుమఘుమ లాడిపోతోంది. శేషాచలం గబుక్కున లేచి గ్లాసు అందుకోబోయాడు.

"అప్పుడే ఏం తొందర? ముందు లేచి మొహం కడుక్కోండి. ఇది అబ్బాయికి! వాడు ఆఫీసుకి వెళ్ళాలి" అంది శాంతమ్మ.

ఆమాటలు శేషాచలాన్ని హేళన చేస్తున్నట్లుగా అతనికి అనిపించాయి.

"మావయ్య! కాస్త మంచం తీస్తారా.. వీధి వూడ్చి పాచిచెయ్యాలి" అంది కోడలు పద్మ. ఎప్పుడూ తన ముందుకి [illegible] కోడలు కూడా [illegible] 'ముసలోడా' అంటున్నట్లు అనిపించింది అతనికి.

కొడుకు ఆఫీసుకి వెళ్తూ "నాన్నా, ఖాళీగానే వుంటారుగా, సాయంత్రం బాబిగాడ్ని స్కూల్ నుండి తీసుకురండి. పద్మకి మళ్ళీ నెలతప్పిందిగా, పాపం అంతదూరం వెళ్ళలేకపోతోంది. షెడ్లోవున్న సైకిల్ రిపేర్ చేయిస్తాలెండి" అన్నాడు.

శేషాచలం 'ఖాళీ' అనేమాట భరించలేకపోతున్నాడు. ఉక్రోషంగా ఏదో అనబోతుండగా "తీసుకొస్తారులేరా! అంతకన్నా ఆయనకి ఏం పనుందనీ?" అంది శాంతమ్మ.

"నాన్నా" పిలిచింది రాధ.

"ఏమ్మా! నీకు ఏవైనా పనిమిగిలిందా? ఖాళీగా వున్న బేవార్సుగాడ్ని కదా నాతో చెప్ప చేస్తాను" కస్సుమన్నాడు శేషాచలం.రాధ తండ్రిని వింతగా చూసి "కాఫీనాన్నా"అంది.

"నాకు అక్కర్లేదు. కాఫీనేకాదు టిఫిన్ కూడా తిన్నంత కడుపు నిండిపోయింది."అని చెప్పలేసుకుని వీధిలోకి నడవబోయాడు. "తాతయ్య...ఈ లెక్క రావడం లేదు. కాస్తచెప్పవా" అని చొక్క అంటిపట్టుకుని లాగాడు మనవడు.

"నేడు పనిమీద వెళ్తున్నాను. ఇప్పుడు కాదు" అన్నాడు శేషాచలం.

"పనిలేదు, పాటలేదు అంతా వట్టిది. మీతాత చేత లెక్కలు చెప్పించుకోరా బాబీ! లేకపోతే వుత్తిపుణ్యాన వూరంతా తిరిగొచ్చి రాత్రవగానే కాళ్ళు నెప్పలంటూ నాప్రాణం తీస్తారు" అంది శాంతమ్మ. తనకి బైటికి వెళ్ళడానికి కూడా హక్కు లేదన్నమాట, అని పళ్ళు పిండుకున్నాడు శేషాచలం.

"అమ్మగారూ, వెళ్ళొస్తా" అంది పనిమనిషి మంగమ్మ.

"ఒసే మంగా...ఈ పలహారం నోట్లోవేసుకుని ఆకాసిని మిరపకాలూ తొడిమలు తీసిపెట్టు. కోడలు చూస్తే ఒట్టిమనిషికాదు! అమ్మయికి కాలేజీ ఇంక మిగిలిన వాళ్ళేవరూ పనికిరారు చస్తున్నాను చేసుకోలేక" విసుక్కుంటూ వేడివేడి ఇడ్లీలు, కొబ్బరి పచ్చడీ ఆకులో పెట్టింది శాంతమ్మ.


శేషాచలానికి ఇడ్లీ, చట్నీ చూడగానే నోరు వూరిపోయింది. కాని భార్య అన్న చివరిమాటకి రోషం వచ్చింది. మిగిలిన వాళ్ళెవరూ 'పనికిరారు" అంటే తను అనేగా! ఛీ...ఈ బ్రతుకు గడిపేకన్నా చావడం నయం. తను ఆ ఇంట్లో పనిమనిషి పాటి చెయ్యడం లేదన్నమాట! అనుకుని విసవిసా బయటికి వెళ్ళిపోయాడు.

పార్కులో బెంచీమీద కూర్చుని వచ్చేపోయేవాళ్ళని చూడసాగాడు. అందరూ హడావిడిగా ఏదో మునిగిపోతున్నట్లూ, కాళ్ళల్లో చక్రాలున్నట్లూ దొర్లిపోతున్నారు! తనూ ఏడాది క్రితం దాకా అలాగే హడావిడిగా ఆఫీసుకు వెళ్తూ వుండేవాడు. ఇంట్లోకి అడుగు పెడ్తుంటేనే శాంతమ్మ కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు అందించి, గబగబా టిఫిన్ ఏర్పాట్లు

## దీపాల తోరణాలు!

దివ్య దీపావళి వచ్చింది!
నవ్య కాంతుల్ని తెచ్చింది!
చిన్నారి పాపల
చిరునవ్వులే
మతాబులు రాల్చే పువ్వులు!
కన్నెపిల్లల మదిలో
మోసులెత్తే కోరికలే
కాకర పువ్వొత్తుల
వూగుత్తులు!
గృహస్థుల గుండెల్లో
చింతలను పారద్రోలి
వెండిపువ్వులవను రాల్చే
చిచ్చుబుడ్లు!
కట్నపిశాచి
కంఠాన్ని ఛేదించే విష్ణు చక్రాలు!
అవినీతిని అంతమొందించే
టపాసులు!
కష్టాల చీకట్లను పారద్రోలి
సుఖాల వెలుగులను అందించే
దీపాలతో రణాలే
ప్రమిదలు!

—కొడిమెల



చెసెది. కొడుకు తనముందు నోరిప్పి ఎరగడు. కోడలు తలుపు వెనకనుండి యివతలకి రాలేదు! కూతురు తనంటే ప్రాణం పెట్టేది. పొద్దుపోయే దాకా కాళ్ళు పడ్తూ కూర్చునేది. ఏవయిపోయాయి ఆబంగారు రోజులూ! ఇప్పడు ప్రొద్దుట లేచిన దగ్గర్నుండీ ఖాళీగా వున్నారుగా...అది చెయ్యండి...ఇది చెయ్యండి...అనే భార్య సాధింపులూ, కొడుకు పురమాయింపులూ, కోడలి నిర్లక్ష్యం, కూతురి తిరస్కారం...చివరికి వెలెడంతలేని మనవడికి కూడా తనంటే గౌరవం లేదు. 'ఒంగోతాతా...గుర్రం ఆట ఆడుకుందాం' అనేస్తాడు. శేషాచలానికి బ్రతుకంటే విరక్తి కలిగింది. ఎవరికీ అక్కర్లేని ఈ బ్రతుకు చాలిస్తేనేం? అని పించింది. లేచి రైలు పట్టాల కేసి నడక సాగించాడు. దూరం నుండి రైలు వస్తున్నట్లుగా శబ్దం వినిపిస్తోంది. పట్టాల మీద అడ్డంగా పడుకోవాలా లేక నిలువుగా పడుకోవాలా అని ఆలోచనలో పడ్డాడు.

రైలు కనిపించింది. దగ్గరగా వచ్చేస్తోంది. ఆలస్యం చేస్తే ధైర్యం పోతుంది. బ్రతుకుమీద తీపి పెరుగుతుంది అని గబుక్కున పట్టాల మీద కాలు పెట్టాడు. అదే వూపుతో వెనక్కి పడ్డాడు. ఎందుకా అని వెనక్కి తిరిగేసరికి పానకాలు కనిపించాడు.

"కళ్ళు ఆనడం లేదా లేక చెవులు వినపడడం లేదా? రైలు వస్తూంటే పట్టాలమీదకి పోతావేం?" అన్నాడు పానకాలు.

"చద్దామనీ!" క్లుప్తంగా చెప్పాడు శేషాచలం.

"ఆ! నోరు తెరిచేసాడు పానకాలు

"నిర్లక్ష్యం అనేది ఎంతటి నరకమో అది పొందు తున్నవాడికి తెలుస్తుందిరా. ఆ ఇంట్లో నేను గడ్డి పోచ విలువ చేయను. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. స్థిరంగా అన్నాడు శేషాచలం.

"మహాలక్ష్మిలాంటి మా వదినా, రామభద్రుడి లాంటి కొడుకూ వుండగా ఇవేం మాటలా?" విస్తుపోయాడు పానకాలు.

శేషాచలం తన పట్టువిడవలేదు. తన నిర్ణయం ఎంతో సమంజసమని వాదించాడు.

చివరికి పానకాలు "ఈ ఒక్కరోజూ నీచావు వాయిదా వేసుకోరా! నాకు నీతో పనుంది" అన్నాడు.

"సంతోషం! కనీసం నువ్వైనా పనుంది అంటు న్నావు. పని లేని వాడిని అనకుండా ఏవిటో చెప్ప" అన్నాడు శేషాచలం.

" నేను అర్జెంటుగా మా అమ్మాయి దగ్గరికి వెళ్ళాల్సిన పని పడింది. అందుకు ఫోను బూత్ మూసేసి వెళ్ళల్సివస్తోంది. ఒక రోజు మూసేస్తే ఎంతలాసో తెలుసుగా నీకు! అందుకని ఈ ఒక్కరోజూ నువ్వుబూత్‌లో కూర్చుంటే నీ మేలు మరిచిపోను. రేపుఉదయానికల్లా నేను తిరిగొస్తాను" అన్నాడు పానకాలు. శేషాచలం ఆలోచించి తన చావు మరునాటికి వాయిదా వేసుకుని బూత్‌లో కూర్చున్నాడు.

పానకాలు నెంబర్ రాసే బుక్కు, టైమ్ అయిపో గానే నొక్కే బటనూ అన్నీ శేషాచలానికి చూపించి తన పని మీద వెళ్ళిపోయాడు.

శేషాచలం కునికిపాట్లు పడ్తుండగా ఓ ముసలాయన వచ్చాడు. ముసలి దేహం వడవడి వణుకుతోంది. ఖల్...ఖల్ మని దగ్గుతూ నెంబర్ తిప్పి పెట్టమని శేషాచలాన్ని బ్రతిమాలాడు. శేషాచలం నెంబర్ డైల్ చేసిచ్చాకా అతను మాట్లాడాడు.

"ఒరే...అబ్బీ...నేనురా నాన్నని! అన్నయ్య తన వంతు గడువు తీరిపోయింది, నన్ను వెళ్ళిపొమ్మంటున్నాడు.. ఖళ్...ఖళ్...ఆ! నాదగ్గు మీ ఆవిడ భరించలేనంటోందా? ఎలారా? వాడేమో పొమ్మంటున్నాడు...నువ్వేమో వద్దంటున్నావు...పోని కాస్త విషమైనా ఇవ్వండిరా...ఖళ్..ఖళ్..ఎంత కష్టపడి పెంచి పెద్దచేసాన్రా మిమ్మల్ని... ఎన్నెన్ని ఆశలు పెట్టుకున్నాను..హలో..హలో.. పెట్టేశాడు వెధవ!"కట్ అయిపోయింది. ఆ కొడుకు ప్రబుద్ధుడు పెట్టేసినట్లున్నాడు. ముసలాయన కంటినీరు తుడుచుకుంటూ రూపాయిబిళ్ళ ఇవ్వబోయాడు.

"వద్దులెండి" అని శేషాచలం తన జేబులో నుండి రూపాయి తీసి గల్లాపెట్టెలో వేసాడు. అతనికి ప్రతినెలా వచ్చే పెన్షన్‌లో సగమే ఇంట్లో ఇస్తాడు.

చాలాసేపు వెళ్ళిపలోయిన ముసలాయన గురించే ఆలోచిస్తుండగా ఓ పాతికేళ్ళ అమ్మాయి కంగారుగా వచ్చింది. ఫోను లాక్కున్నట్లుగా జరుపుకుని, ఆత్రంగా "హలో..రవిగారున్నారా..ఆ! రవీ! నేనే లతని..ఇప్పడే డాక్టర్ చెప్పింది నాకు




ప్రెగ్నెన్సీ వచ్చింది. మనం వెంటనే పెళ్ళి చేసుకోవాలి. ఏవిటీ? అబార్షనా? నీకు ముందే పెళ్ళయిందా? రవీ! నువ్వు కాదంటే నాకు ఇప్పుడ ఆత్మహత్యే శరణ్యం..నాతోబాటు తల్లిదండ్రులు కూడా చనిపోతారు..ఏమిటీ పోనీనా? నేను నీవల్లే తల్లినౌతున్నానని ఏవిటి గ్యారంటీనా? ఛీ..దుర్మార్గుడా..నీలాంటి వాడితో బ్రతకడం కన్నా చావడం మేలురా...బై!" ఆమె ఏడుస్తూ ఫోను పెట్టేసింది. రూపాయి పారేసి పరిగెత్తింది. చవడానికేమో! ఆ తరువాత ఇంకో స్త్రీ వచ్చింది. ఆవిడదో కథ!

"అన్నయ్యా..కట్నం బాకీ ఇవ్వకపోతే నన్ను వాళ్ళు చంపేసేటట్లు వున్నారు. మొన్న మామావగారు పురుగుల మందు టిన్ను తెచ్చారు. మా అత్తగారు ఎక్కడినుండో ఏసిడ్ సీసా తెప్పించింది. మా ఆయనైతే కిరోసిన్ పోసి తగుల బెట్టి ఇంకో పెళ్ళి చేసుకోబోతున్నాని తాగిన నిషాలో చెప్పేశాడు. ఒక్కసారిరా అన్నయ్య...ప్లీజ్! నాకు చావాలని లేదు...చావాలని లేదు!" ఆమె వలవలా ఏడ్చింది.

శేషాచలానికి తన కూతురు గుర్తుచ్చి మనసంతా వ్యాకులమై పోయింది.

ఇంకో యువకుడు తండ్రి ఆపరేషన్‌కోసం ఒక్క వెయ్యి రూపాయలు సర్దమని స్నేహితుడ్ని ప్రాధేయ పడ్డాడు. ఇంకో ముసలావిడ ఏడుస్తూ కొడుక్కి చెప్పింది. అతను అట్నుంచి ఆవిడమీద అరుస్తున్నాడు.

శేషాచలం ఠక్కున లేచాడు. తన ముద్దులొలికే మనవడు గుర్తుచ్చాడు. 'అయ్యో! ఎవ్వరైనా ఎత్తుకుపోతేనో!' అనిపించి గబుక్కున బూత్‌కి తాళం వేసేసాడు. పానకాలు వస్తే ఏదో చెప్పకోవచ్చులే అని స్కూల్‌వైపు పరుగులాంటి నడక ప్రారంభించాడు. మనవడ్ని చూడగానే అతనికి పోయిన ప్రాణం వచ్చినట్లయింది. వాడ్ని ఎత్తుకుని వచ్చి, ఇంట్లోకి అడుగు పెడ్తుంటే...

"మావయ్యగారూ...ఎండలో మీరు ఎక్కడికి వెళ్ళారో తెలియక చూసి, చూసి మీ అబ్బాయికి ఫోను చేసాను. ఆయన స్కూటర్ వేసుకుని మీకోసం వెతుకుతున్నారు. అత్తయ్యగారు మీరు ఏమైపోయారోనని ప్రొద్దుటినుంచి పచ్చిమంచి నీళ్ళు ముట్టలేదు! రాధ అయితే ఒకటే ఏడుపు!" అంది కోడలు పద్మ.

శేషాచలానికి వారి ప్రేమా తనపట్ల వున్న ఆదూర్దా చూస్తుంటే తన తొందరపాటు నిర్ణయానికి ఎంతో సిగ్గేసింది. వీళ్ళనా తాను ఒదిలిపోవాలనుకుందీ! అని బాధేసింది.

శాంతమ్మ వచ్చి భర్తని పట్టుకుని "నావల్ల ఏమైనా పొరపాటు జరిగితే క్షమించండి"! అని ఏడ్చేసింది. కూతురు కూడా వచ్చి చుట్టుకుపోయింది.

"నాన్నా...ఎక్కడికెళ్ళావు? ఎంతభయం వేసిందో తెలుసా?" అంటూ కొడుకు వచ్చాడు.

శేషాచలం వాళ్ళని దగ్గరికి తీసుకుని తృప్తిగా థాంక్సరా పానకాలు! కష్టాలెలా వుంటాయో, నాజీవితం ఎంత హాయిగా వుందో తెలియజెప్పావు! అనుకున్నాడు.

---

## కాలుతున్న ఇటుకలు




అక్షరాలు నీ జీవ కణాలు
పుస్తకాల అట్టలు నీ ఉదయాస్తమయాలు
వాక్యాల్లో పయనిస్తావు
పేజీల అంపశయ్యపై శయనిస్తావు
గాలిపడగల రంగుల కలలకు దూరమౌతావు
బండెడు పుస్తకాలలో గున్నమామిడి పిందెలా
రిక్షాకి వేలాడుతావు
గ్లోబులో జీవిస్తూ పుస్తకారణ్యాల్ని
రెండు కాగడాల సాయంతో అన్వేషిస్తావు
పోటీ పద్మవ్యూహంలో ప్రవేశించాక నీ బతుకు లూటీ
అక్షరమే నీకు ఏడేడు లోకాల సాటి
చదువు నీ బాల్యాన్ని చెరసాలలోకి నెడుతుంది
ఉద్యోగం నీ యవ్వనానికి శిలువ వేస్తుంది
కడుపులో నీవున్నపుడే కాన్వెంటులో వున్నట్లు
నీ మమ్మీ అనుభూతి చెందుతుంది
విమానాల్లో విదేశాలు తిరుగుతున్నట్లు
నీ కదలికలకు కలలు కంటుంది
జన్మాంతర జ్ఞాపకాలు లేకపోవడం
ఆటపాటల స్మృతులు రాకపోవడం ని భాగ్యం
బతుకు స్మశానంలో పుస్తకాల చితిపై కాలిపోవడం నీ దౌర్భాగ్యం
నీవు తండ్రి వైనవుడు నీ బిడ్డకు
చంద్రోదయాన్ని, ఇంద్రధనుస్సుల్నీ గ్రంథాలలోనే చూపిస్తావు
ఇంటర్వ్యూలు నీలో నిరాశల మంటల్ని రాజబెడుతూంటే
బిగుసుకున్న వ్యాపార ఉచ్చుల్లో బందీయైన
ఓ విద్యార్థీ!
ఆత్మాహుతి దళం లాంటి ఇటుక ఆవాన్ని
నీవు చూస్తున్నపుడే నాకు తెలిసింది
నీవు లోలోన కాలుతున్నావని

—పైల కృష్ణారావు